

రేపటి నుంచి బీఎస్ఎన్ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

అరసవల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినియోగదారులకు మరింత సమర్థవంతమైన సేవలందించేందుకు ఈ నెల 27నుంచి విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ మర్రినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది ఎవరైనా అవినీతికి పాల్పడితే తక్షణం ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదులను ఉపమండల ఇంజినీర్ (విజిలెన్స్), జనరల్ మేనేజర్ కార్యాలయం, శ్రీకాకుళంలోని బీఎస్ఎన్ఎల్ సంచార భవన్ చిరునామాకు పంపవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 08942- 226 700, 9441668789 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

రవాణాశాఖ అధికారులు.. కళ్లు తెరిచారు

- ఇన్నాళ్లూ స్తబ్దతగా.. కర్నూలు ఘటనతో తనిఖీలు
- ప్రైవేటు ట్రావెల్స్‌లో ఇష్టానుసారంగా పార్సిల్స్ రవాణా
- ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం
- ఉన్నతస్థాయిలో దృష్టి సారిస్తేనే ఫలితం



శ్రీకాకుళంలో ప్రైవేటు బస్సులు

శ్రీకాకుళం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):

ఇన్నాళ్లూ స్తబ్దత పాటించిన రవాణాశాఖ అధికారులు.. ఎట్టకేలకు కళ్లు తెరిచారు. ప్రైవేటు ట్రావెల్స్‌లో ఇష్టానుసారంగా దందాలు జరుగుతున్నా.. ఏనాడూ అధికారులు కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కాగా.. కర్నూలు సమీపంలో గురువారం అర్ధరాత్రి దాటాక ఓ ప్రైవేటు బస్సు.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో రవాణాశాఖ అధికారులు శనివారం జిల్లాలో ప్రైవేటు బస్సులను తనిఖీలు చేశారు. కానీ ఏ ఒక్కరిపైనా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

● ఇష్టానుసారంగా పార్సిల్స్ తరలింపు..

జిల్లాలోని శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం, కొత్తూరు, నరసన్నపేట తదితర ప్రాంతాల నుంచి ప్రైవేటు ట్రావెల్స్ ఆధ్వర్యంలో బస్సులు నడుపుతున్నారు. ప్రతిరోజూ హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, అమలాపురం వంటి ప్రాంతాలకు ఈ బస్సుల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. పాతపట్నం నుంచి ఎక్కువగా తెలంగాణ రాష్ట్రానికి బస్సులు వెళ్తుంటాయి. శ్రీకాకుళంలో బలగ నుంచి సుమారు 80 నుంచి 100 వరకు బస్సు సర్వీసులు ప్రతిరోజు రాకపోకలు సాగిస్తున్నాయి. చాలా బస్సులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. ప్రైవేటు ట్రావెల్స్‌లో ప్రయాణికుల వస్తువులు మినహా.. ప్రయాణంతో సంబంధంలేని పెద్దపెద్ద మూటలు.. ఇతరత్రా పార్శిల్స్ తరలించకూడదు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేటు ట్రావెల్స్ పార్సిల్స్ సైతం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. శ్రీకాకుళంలో ట్రావెల్స్ కార్యాలయాలు.. అన్నీ పార్సిల్స్‌ను స్వీకరిస్తున్నాయి. ఎలక్ట్రికల్ వస్తువులు, లారీ సామగ్రి, ఫర్నీచర్‌తోపాటు.. ఇనుప వస్తువులను సైతం ట్రావెల్స్ బస్సుల్లో రవాణా చేస్తున్నాయి. రకరకాల అట్టపెట్టెలు, బస్తాల్లో ఈ సామగ్రిని ప్యాకింగ్ చేసి దూరప్రాంతాలకు తరలిస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే.. బస్సుల్లో ప్రయాణికులకు ఇబ్బందికరంగాను.. ప్రాణాలపైకి వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. కర్నూలు బస్సు ఘటనలో ఒక్కసారిగా ఫోన్లు కూడా పేలిపోయాయి. అన్ని ఫోన్లు ఎక్కడ నుంచి ఎక్కడకు రవాణా చేస్తున్నారనే దానిపై దర్యాప్తు జరుగుతోంది. జిల్లాలో పార్సిల్స్ తరలింపు ప్రక్రియను ఇంతవరకూ అధికారులు అడ్డుకున్న దాఖలాలు లేవు. తెరవెనుక (మిగతా 7వ పేజీలో..)

ట్రావెల్స్ బస్సుల తనిఖీలు..



టెక్కలిలో ప్రైవేట్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ

టెక్కలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో ట్రావెల్స్ బస్సులను శనివారం రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. టెక్కలి ఎంవీఐ డి.సంజీవరావు నేతృత్వంలో ప్రైవేట్ బస్సులను నిలుపుదల చేసి ఎమర్జెన్సీ డోరు, అలారం సౌకర్యం, గ్లాసులు బ్రేక్ చేసేందుకు అవసరమైన హేమర్ వంటి సామగ్రి, డ్రైవర్ లైసెన్స్‌లు, వాహన ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు పరిశీలించారు. ఎమర్జెన్సీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



హైకోర్టు న్యాయమూర్తులను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి అన్నారు. శనివారం శ్రీకాకుళంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో హైకోర్టు మరో న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్ కుమార్‌తో కలిసి జిల్లా 7వ అదనపు న్యాయస్థానాన్ని ప్రారంభించారు. వారిని జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో పలువురు న్యాయాధికారులు ఘనంగా సన్మానించారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్ న్యాయవాదుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కక్షిదారులకు న్యాయాన్ని అందిచడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని తెలిపారు. న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. జూనియర్ న్యాయవాదులు సీనియర్ల నుంచి ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా నేర్చుకోవాలని సూచించారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తులను బీసీ న్యాయవాదుల సంఘం, కోర్టు ఉద్యోగస్థుల అసోసియేషన్, ప్లీడర్ గుమస్తాల సంఘం సభ్యులు కూడా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పిట్టా దామోదర్, అసోసియేషన్ ప్రతినిధులు భవానీ ప్రసాద్, కొమ్ము రమణమూర్తి, ఆరంగి అప్పలరాజు, గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న.. 'మొంథా'

- రైతుల్లో కలవరం
- మరో 15 రోజుల్లో కోతలు
- ఇంతలోనే తుఫాన్ గుబులు



జమ్ములో కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు

నరసన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల గుండెల్లో 'మొంథా' తుఫాన్ హెచ్చరికలు గుబులు రేపుతున్నాయి. పంట చేతికి అందే సమయంలో ఏటా తుఫాన్లు దాడి చేస్తున్నాయి. ఈ ఏడాదీ ఆ కలవరం తప్పడం లేదు. మరో రెండువారాల్లో వరి కోతలకు సిద్ధమవుతున్న రైతులు తుఫాన్ హెచ్చరికలతో భీతిల్లుతున్నారు. తుఫాన్ ప్రభావంతో రేపటి నుంచి రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసింది. పంట చేతికి అందే సమయంలో ఈదురుగాలులు వీస్తే భారీగా నష్టం జరిగే అవకాశం ఉంది. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి.. ఆరుగాలం శ్రమించే అన్నదాతలు నోటి వద్దకు కూడు వచ్చే సమయంలో తుఫాన్ హెచ్చరికలతో నిద్రకు దూరమవుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 3.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. మరో 32 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 12 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేశారు. జిల్లాలో పాతపట్నం, సారవకోట, నరసన్నపేట, జలుమూరు, తదితర మండలాల్లో అక్కడక్కడ కోతలు పూర్తయ్యాయి. సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, ఆమదాలవలస, గార, శ్రీకాకుళం రూరల్, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు, మందస, తదితర మండలాల్లో సుమారు 1.70లక్షల ఎకరాల్లో వరి కోత దశకు వస్తోంది. మరికొన్ని ప్రాంతాల్లో పాలు పోసుకునే దశలో ఉంది. ఈ సమయంలో కనీసం 40 కి.మీ. వేగంతో గాలులు వీచినా వరిపైరు నేలకొరిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం, జి.సిగడాం, పొందూరు తదితర మండలాల్లో మొక్కజొన్నను భారీగా సాగు చేస్తున్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటే భారీ స్థాయిలో నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆ ప్రాంత రైతులు చెబుతున్నారు.

అధికారులు అప్రమత్తం

మొంథా ప్రభావంతో భారీగా వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఇప్పటికే కోసిన ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కాపాడుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో టార్పాలిన్లు ఉచితంగా అందించేందుకు (మిగతా 7వ పేజీలో..)

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

- ప్రాణ, ఆస్తినష్టం జరగడానికి వీల్లేదు
- ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



శ్రీకాకుళం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. శనివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఆయన మాట్లాడుతూ.. 'మొంథా తుఫాన్ జిల్లాపై ఈ నెల 28, 29 తేదీల్లో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలి. జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రతీ మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాల'ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో 08942-240557 నెంబరుతో కంట్రోల్‌రూమ్ సిద్ధంగా ఉందన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని సూచించారు. అత్యవసర విధుల్లో ఉన్న అధికారుల సెలవులను రద్దు చేస్తున్నామన్నారు. ప్రజలు నదులు, చెరువులు, సాగునీటి కాలువల వద్దకు వెళ్లకుండా చూడాలని, అవసరమైతే అటువంటి ప్రాంతాల్లో గస్తీని ఏర్పాటు చేయాలని తెలిపారు. మట్టి గోడలతో ఉన్న ఇళ్లు, శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో నివసించే వారిని సురక్షిత, పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. విద్యుత్, తాగునీటికి అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

● పోక్సో కేసుల్లో ఎక్కువగా బాధితుల బంధువులే నేరస్థులుగా ఉంటున్నారు. వారి మాటునే ఎక్కువగా లైంగిక దాడులు జరుగుతున్నాయి. అందుకే పిల్లలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలి. పాఠశాలలు, హాస్టళ్లలో ఉండే బాలికలకు బయటకు తీసుకెళ్లేందుకు కేవలం తల్లిదండ్రులకు మాత్రమే అనుమతించాలి. బాలికల భద్రత అనేది పోలీసులదే కాదు. తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు సైతం ఆ బాధ్యత తీసుకోవాలి.

-ఇటీవల జిల్లాలో పర్యటించిన సమయంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆదేశాలివీ.



అమ్మా.. జాగ్రత్త!

- చిన్నారులపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- బాలికలకు తప్పని లైంగిక వేధింపులు
- పోక్సో చట్టం అమలు చేస్తున్నా.. రెచ్చిపోతున్న కీచకులు

● హిరమండలం మండలానికి చెందిన 14 ఏళ్ల బాలిక.. తనను పాఠశాలలో డైరెక్టర్ వేధిస్తున్నారంటూ ఇటీవల 100కు ఫిర్యాదు చేసింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు చేసి.. ఆ డైరెక్టర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

● రణస్థలం మండలంలో ఇటీవల 14 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో యువకుడు కిడ్నాప్ చేశాడు. చివరకు బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచారు.

● ఈ ఏడాది మే 4న జిల్లాకు చెందిన ఇద్దరు పోక్సో నిందితులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. సారవకోట మండలంలో ఒకరు, హైదరాబాద్‌లో నివాసముంటున్న జిల్లావాసి పోక్సో కేసులో అరెస్టయ్యారు. బెయిల్‌పై విడుదలైన అనంతరం వారిద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు.

రణస్థలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి)

..ఇలా జిల్లాలో చిన్నారులపై లైంగికదాడులు పెరుగుతున్నాయి. వేధింపులకు సంబంధించి కేసులు బయటకు వస్తున్నవి కొన్నే. పరువు పోతుందని గ్రామాల్లోనే చాలా కేసులు సర్దుబాటు చేస్తున్నారు. ఇటీవల తునిలో బాలికపై అఘాయిత్యం, ఆపై నిందితుడు ఆత్మహత్య (మిగతా 8వ పేజీలో..)

కన్నతండ్రే కాటేశాడు

- కూతురిపై కామాంధుడి పైశాచికం
- గర్భం తొలగించే యత్నంలో చికిత్స వికటించి కుమార్తె మృతి

పాతపట్నం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అభం.. శుభం తెలియని 11 ఏళ్ల కుమార్తెపై.. 54 ఏళ్ల కన్నతండ్రే కన్నేశాడు. కంటికి రెప్పలా కాపాడాల్సిందిపోయి.. ఆ చిన్నారి పాలిట కాలయముడయ్యాడు. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేశాడు. ఆస్పత్రిలో గర్భాన్ని తొలగించే యత్నంలో చికిత్స వికటించి ఆ కుమార్తె మృతి చెందింది. పాతపట్నం మండలంలో ఈ నెల 16న ఈ ఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై ఆస్పత్రి వైద్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని పాతపట్నం ఎస్ఐ కె.మధుసూదనరావు పోక్సో కేసు నమోదు చేశారు. దీనిపై టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు దర్యాప్తు నిర్వహించి నిందితుడ్ని శనివారం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు నవంబరు 7వరకూ రిమాండ్ విధించిందని సీఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు

- బాలిక తల్లి సహకారంతోనే లైంగిక దాడి
- నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రణస్థలం మండలం జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఆటోడ్రైవర్ పిన్నింటి రామా రావుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళంలో తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. 'ఆటోడ్రైవర్‌కు సదరు బాధిత బాలిక తల్లితో 8 ఏళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. తరచూ ఆమె ఇంటికి వెళ్లే క్రమంలో 13ఏళ్ల ఆమె కుమార్తెపై కన్నేశాడు. నిత్యం బాలికపై లైంగికంగా వేధించేవాడు. ఇదంతా తెలిసినా కూడా బాధిత బాలిక తల్లి మద్యానికి బానిసై సదరు ఆటోడ్రైవర్‌ను ప్రోత్సహించిందే తప్ప నిలువరించలేదు. బాలిక పిన్ని, బాబాయ్, మేనమామలు జరిగిన విషయాన్ని తెలుసుకొని జేఆర్‌పురం పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టి ఆటోడ్రైవర్ రామారావును, బాలిక తల్లిని అరెస్టు చేశాం. ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేశాం. ఆటోను కూడా సీజ్ చేశాం. నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించామ'ని డీఎస్పీ తెలిపారు. 'ప్రధానంగా ఎక్కువ మంది బంధువులు, తెలిసిన వారు, ఆటో డ్రైవర్లే బాలికలపై లైంగికంగా వేధింపులకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఆటోల్లో పాఠశాలలకు పంపించినప్పుడు ఒక కంట కనిపెడుతూ ఉండాలి. ఆటోడ్రైవర్ల ప్రవర్తనను పరిశీలిస్తుండాలి. మహిళా పోలీసులు వారంలో నాలుగు రోజులు పాఠశాలలకు వెళ్లి గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. మహిళలపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే మాకు సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామ'ని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కిల్లిపాలెంలో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

సందడిగా నాగుల చవితి

అరసవల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగులచవితి పర్వదినం వేళ.. జిల్లాలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. పల్లెలు, పట్టణాలు ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. శనివారం జిల్లావాసులు నాగులచవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వాతావరణం అనుకూలించడంతో చిన్నారుల నుంచి పెద్దల వరకూ అందరూ చవితి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకాకుళం నగరంలో పుట్టలు పెద్దగా అందుబాటులో లేకపోవడంతో చాలామంది వాహనాలపై కిల్లిపాలెం, ఖాజీపేట తదితర గ్రామాల్లో పొలాలు, తోటల వద్దకు చేరుకుని పుట్టలకు పూజలు చేశారు. నువ్వులతో తయారుచేసిన ఉండలు, సలివిడి, వడపప్పు నైవేద్యంగా సమర్పించి పుట్టల్లో గుడ్లు, పాలు పోశారు. ఇదిలా ఉండగా కొంతమంది పొట్టకూటి కోసం పుట్టల్లో భక్తులు వేసిన గుడ్లను ఏరి సంచుల్లో నింపుకోవడం కనిపించింది.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కట్టుబట్టలతో మిగిలారు

- నాలుగు పూరిళ్లు దగ్ధం
- సవర పద్మాపురంలో ఘటన

8లో

స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



అరసవల్లి: హైకోర్టు న్యాయమూర్తులకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ

అరసవల్లి/గార/జలుమూరు అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి, జస్టిస్ తుహిన్ కుమార్ గేదెల శనివారం జిల్లాలోని అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం దేవాలయాలను దర్శించుకున్నారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీకూర్మం కూర్మనాథ స్వామి ఆలయంలో ఈవో నరసింహ నాయుడు, ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు స్వాగతం పలికారు. శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర స్వామి ఆలయంలో సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం వారి గోత్రనామాలతో స్వామికి అర్చకులు విశేష పూజలు చేశారు. న్యాయమూర్తులకు అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేయగా అధికారులు స్వామి వారి ప్రసాదం, చిత్రపటాలను అందించారు. కార్యక్రమంలో పాతపట్నం, నరసన్నపేట జూనియర్ సివిల్ న్యాయాధికారులు ఎం.రోషిణి, ఎస్.వాణి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

నందిగాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తప్పుడు మార్గాల వైపు వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని టెక్కలి సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల అన్నారు. శనివారం నందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. చదువుపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణమోహన్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.పరీష్ కుమార్ అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పనిచేసే చోట ఎదుర్కొనే సమస్యల కోసం ఒక ప్రత్యేక చట్టం ఉందని, దానిలో ఉండే శిక్షాస్మృతిని వివరించారు. పోక్సో చట్టం ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నమ నాయుడు, మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్, తహసీల్దార్ ఎన్.వెంకటరావు, న్యాయవాదులు ఉలాల భారతి దివ్య, ప్రేమలత, సత్యనారాయణపాడి, ఎస్ఎల్ నారాయణ, సోమశేఖర్, డి.కృష్ణమూర్తిరెడ్డి, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైంగిక నేరాల నుంచి రక్షణకు పోక్సో చట్టం

ఆమదాలవలస, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై జరిగే లైంగిక నేరాల నుంచి బాధితులను రక్షించేందుకు 2012లో పోక్సో చట్టం తీసుకువచ్చారని, దీనిపై 18 ఏళ్లలోపు బాల బాలికలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.రమ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పోక్సో కేసుల్లో నిందితులకు జీవితఖైదు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు కణితి విజయ లక్ష్మి, అన్నెపు సత్యనారాయణ, బొడ్డేపల్లి మోహనరావు, చింతాడ సత్యం, తమ్మినేని అన్నం నాయుడు, ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్, ఎన్ఎస్ఎస్ పీవో జె.రవి బాబు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులను నమ్మొద్దు

పొందూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లోని విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. స్థానిక బాలికల వసతి గృహంలో శనివారం సమాజంలో పరిస్థితులు, పలు చట్టాలపై అవగాహన కలిగించారు. విద్యార్థినులపై వార్డెన్లు జాగ్రత్త వహించాలన్నారు. పోక్సో చట్టం, యాంటీ ర్యాగింగ్ తదితర అంశాలను వివరించారు. న్యాయాధికారులు ఎం.రాము, కె.అశోక్, వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

పాతపట్నం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని పాతపట్నం కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి మానం రోషిణి తెలిపారు. స్థానిక ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ చట్టాలను వివరించారు. న్యాయవాదులు ఎం.రమణ, జి. ఫల్గుణరావు, కళాశాల డైరెక్టర్లు మధుబాబు, సాయి సంతోష్‌తేజ, ప్రిన్సిపాల్ మెట్ట ఆంజనేయులు, ఏఎస్ఐలు జామి శ్రీరాములు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

కొత్తూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) బాల్య వివాహాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కొత్తూరు కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి కందికట్ల రాణి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. లైంగిక దాడుల నుంచి బాలికలను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వై.జోగారావు, సీఐ ప్రసాద్, న్యాయవాదులు వలురౌతు సుధాకరావు, అప్పారావు, రాడ రాజు, గేదల ఫల్గునరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో బీవీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల కోసం రూపొందించ బడిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోటబొమ్మాళి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎం.రోషిణి ఆదేశాలు మేరకు శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది వి.అప్పలనాయుడు, ప్రిన్సిపాల్ కె. లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖ అధికారులు..

కళ్లు తెరిచారు

(ఐదో పేజీ తరువాయి)

అధికారుల సహకారంతోనే ప్రైవేటు బస్సుల్లో ప్రయాణికులతోపాటు పెద్దమొత్తంలో పార్శిల్స్ తరలింపు జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి.

● తనిఖీలు ముమ్మరం.. కేసులు లేవాయె..

శనివారం జిల్లాలో పలు ప్రైవేటు బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో అన్ని డాక్యుమెంట్స్ సరిపోయాయా.. బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు, ఎమర్జెన్సీ డోర్.. ఫిట్‌నెస్ ఉన్నాయో లేవో అని పరిశీలించారు. రాత్రి ఏడు గంటల సమయానికి 15 బస్సులను తనిఖీ చేసినట్లు సమాచారం. అయితే ఏ ఒక్కదానిపైనా కేసులు నమోదు కాలేదు. అంటే సర్వం సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించినట్లే. పార్శిల్ సర్వీసులు.. భారీ బరువులతో ప్రైవేటు బస్సులలో తరలిస్తే.. అనుకోని విధంగా ప్రమాదం సంభవిస్తే దూరం ప్రయాణిస్తున్న వారి గతేమవుతుందో అన్నది అధికారులు ఇప్పటికైనా ఆలోచిస్తే బాగుండేది. ప్రైవేటు బస్సుల్లో ఈ తరహా దందాను అరికట్టాల్సి ఉంది. దీనిపై ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేటు బస్సులో సరుకుల రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నిబంధనలు పాటించనివాటిపై కఠినంగా వ్యవహరించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

● ప్రయాణికుల బస్సుల్లో పార్సిల్స్ సర్వీసు కుదరదు..

ప్రయాణికులతో వెళ్లే బస్సుల్లో పార్సిల్స్ పేరిట సరుకుల రవాణా చేయకూడదు. ఇవన్నీ తనిఖీ చేస్తున్నాం. శనివారం జిల్లా వ్యాప్తంగా 15 వాహనాలను తనిఖీ చేశాం. ఇంకా తనిఖీలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి కేసులు నమోదు కాలేదు.

-విజయసారథి, డీటీసీ, శ్రీకాకుళం

ఐక్యతా యాత్రను విజయవంతం చేయండి

● ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జిల్లాలో నిర్వహించనున్న 'సర్దార్ 150 ఐక్యతా ర్యాలీ'ని విజయ వంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కోరారు. కలెక్టరేట్ కార్యాల యంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే, రాష్ట్ర కో-కన్వీనర్ నడుకుదిటి ఈశ్వర రావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడు తూ.. ఈ కార్యక్రమం జిల్లాలో ఈనెల 31 నుంచి నవంబరు 25తేదీ వరకు నిర్వహి స్తామన్నారు. ఈనెల 31న ఉదయం 7 గంటలకు 500 మందితో స్థానిక సూర్యమహల్ జంక్షన్ నుంచి డా.బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియం వరకు పాదయాత్ర ఉంటుందని, అనంతరం ఆడిటోరియంలో సమావేశం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు మాట్లాడుతూ.. దేశంలోని సంస్థానాలను విలీనం చేసి బలమైన దేశ నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. ఐక్యతా ర్యాలీలో యువత పాల్గొనాలని కోరారు. అనంతరం ఐక్యతా యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, మై భారత్ డీడీ కె.వెంకట్ ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.





ఐక్యతా యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్ (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

నేడు విద్యుత్‌కు అంతరాయం

అరసవల్లి/గుజరాతీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పీఎన్ కాలనీ, బలగ సెక్షన్ల పరిధిలో ఎమర్జెన్సీ పనులు చేపట్టనున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, బాబమ్మనగర్, బలగ మెట్టు, జడ్డి బంగ్లా, పొడుగు నారాయణమ్మ కాలనీ, బావాజీతోట, ఆదివారంపేట, శాంతి నగర్‌కాలనీ, రైతు బజారు, డే అండ్‌నైట్, పాలకొండ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

'మొంథా' తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

● డీఐజీ గోపీనాథ్ జట్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఐజీ

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీ నాథ్ జట్టి ఆదేశించారు. ఈ మేరకు శనివారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలతో విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్, సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం నుంచి ఎస్పీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. తుఫాన్ నేపథ్యంలో ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన పరికరాలు, వనరులు సిద్ధం చేసుకోవాలన్నారు. తీర ప్రాంత గ్రామాలను సందర్శించి మత్స్యకారులు, గ్రామస్థులకు తగిన హెచ్చరికలివ్వాలన్నారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలన్నారు. ముంపు ప్రాంతాలు, లోతట్టు గ్రామాలను ముందుగానే గుర్తించి భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. పాత నేరస్తులు, అంతర్రాష్ట్ర గ్యాంగ్‌ల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడి స్టేషన్లలో ఉన్న వాహనాలను త్వరితగతిన డిస్పోజల్ చేయాలన్నారు. శాంతి భద్రతలపై చర్చించి పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదన్నారు.

జాతీయస్థాయి పోటీలకు బెహరా ఎంపిక



జాతీయపోటీలకు ఎంపికైన విద్యార్థి

కవిటి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మాధవ్ బెహరా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని కోచ్ ఎం.సతీష్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా బీఆర్ అంబేద్కర్ గురుకుల క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ అండర్-19 విభా గంలో ఐదు కిలోమీటర్ల నడక పోటీలో పాల్గొని విజేతగా నిలిచాడన్నారు. నవంబరు 26 నుంచి 29వ తేదీ వరకు హర్యానాలో జరిగే జాతీయ పోటీలో పాల్గొంటాడన్నారు.

ముంచుకొస్తున్న.. 'మొంథా'

(ఐదో పేజీ తరువాయి)

సిద్ధంగా ఉంచాలని కోరుతున్నారు. తుఫాన్‌పై రైతులను అప్రమత్తం చేయాలని రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు ప్రభుత్వం సూచించింది. తీర ప్రాంతాల్లోనూ ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. తుఫాన్‌కు ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు.

భవిష్యత్‌ను మార్చనున్న కృత్రిమ మేధ

● ఆర్జీయూకేటీలో

48 గంటల హ్యాకథాన్ ప్రారంభం

ఎచ్చెర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ గణన, కృతిమ మేధతో భవిష్యత్‌లో పరిశ్రమలను సమూలంగా మారుస్తుందని ఐఏఐఆర్ సంస్థ కృత్రిమ మేధ (యూఎస్ఏ) సంచాల కుడు శ్రీనివాస్ తుదుము అన్నారు. ఆర్జీయూకేటీ శ్రీకాకుళం ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్విస్కిల్ ఫాల్ ఫెస్ట్-2025లో ఐదో రోజు శుక్రవారం ఆన్‌లైన్ వేదికగా మాట్లాడారు. వినూత్న సాంకేతికత ప్రాధాన్యతను వివరించారు. డేటా టెక్ ప్రధాన సాంకేతిక అధికారి డాక్టర్ జ్ఞాన్ యల్లా మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాల పెంపు తదితర అంశాలను వివరించారు. సీడ్యాక్ (బెంగళూరు) క్వాంటమ్ గణన యంత్ర నిర్మాణ నిపుణుడు తిలక్ సాధుఖాన్ 'క్యూయూనివర్స్' అంశంపై అవగాహన కల్పించారు. క్వాంటమ్ సాంకేతిక వినియోగించి సమస్యలను పరిష్కరించేందుకు 48 గంటల హ్యాకథాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న అధ్యాపకుడు డాక్టర్ సూరి గణేష్

ఆర్జీయూకేటీ అధ్యాపకుడికి ఎక్స్‌లెన్స్ అవార్డు

ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎంపీ సూరి గణేష్ భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డును శనివారం హైదరాబాద్ టీ హబ్‌లో స్వీకరించారు. విద్యారంగంలో చేసిన సేవలకు గాను ఈ అవార్డును అంద జేశారు. అకడమిక్ ఎచీవ్‌మెంట్స్, పరిశోధనలో కృషి, విద్యార్థుల ఫీడ్ బ్యాక్, విద్యా నాయకత్వం తదితర అంశాలను ప్రామాణికంగా తీసు కుని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్న సూరి గణేష్‌ను క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ తదితరులు అభినందించారు.

కల్తీమద్యంపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

● ఎమ్మెల్యే గొండు శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యంపై మాట్లాడే అర్హత మాజీ సీఎం జగన్ రెడ్డికి లేదని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక మహాలక్ష్మినగర్ కాలనీలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కల్తీమద్యం ఫార్ములాను తాడేపల్లి ప్యాలెస్‌లోనే తయారుచేశారని విమర్శించారు. దీనిపై సిట్ విచారణ జరుగుతోందని, అన్ని వివరాలు త్వరలోనే పూర్తి సాక్ష్యాలతో బయటకు వస్తాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సరఫరా చేసిన మద్యంలో ప్రమాకర విష రసాయనాలున్నాయని, చెన్నై, బెంగళూరు, అమెరికా ల్యాబ్ లు స్పష్టం చేశాయని, ముడుపుల సొమ్ము తో విదేశాల్లో భూములు కొనుగోలు చేసినట్లు ఫోరెన్సిక్ విశ్లేషణలో బయటపడిందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, ఏం చేయాలో పాలుపోక, కల్తీ మద్యం అంటూ తప్పుడు కూతలు కూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీఎంజే బాబు, పాండ్రంకి శంకర్, పిరియా మాధవి, పంచిరెడ్డి అప్పల నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించేదిలేదు: శివ్వాల

సరుబుజ్జిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎవరు అడ్డుకున్నా సహించేది లేదని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్య నారాయణ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, జిల్లా తూర్పుకాపు సాధికార డైరెక్టర్ పల్లి సురేష్, నియోజకవర్గ తెలుగు యువత నాయకులు తాడేల రాజారావుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. వెన్నెలవలస సమీపం లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌పై కొంతమంది చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మాను కోవా లని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు కందుల వెంకటరావు, ఎండ రామారావు పాల్గొన్నారు.

వ్యక్తిని ఢీకొన్న కారు: కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. అయితే కారు ఆపకుండా వెళ్లిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పుణ్యపు వీధికి చెందిన ముక్కాల వెంకటరమణ శుక్రవారం పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద సైకిల్‌ను నడిపించుకుంటూ వెళుతున్నాడు. మారుతీ థియేటర్ రోడ్డు నుంచి చిన్నబరాటం వీధిలోకి వెళుతున్న కారు ఢీకొనడంతో వెంకటరమణకు గాయాలయ్యాయి. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక ప్రార్థనలు

ఆమదాలవలస, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్షేమాభివృద్ధిని కాంక్షిస్తూ.. మండల పాస్టర్లు, లీడర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం గాజుల కొల్లివలసలో ప్రత్యేక ప్రార్థన సహవాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ జీడీ పాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి సామరస్యం, రాజధాని నగర నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాల విజయవంతం కావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ శామ్యూల్ అరుణ్ కుమార్, బోసుబాబు, రాజు, చంద్రశేఖర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మద్యం విక్రయానికి చర్యలు

సోంపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సోంపేట సర్కిల్‌లో మద్యం దుకాణాల్లో నాణ్యమైన మద్యం విక్రయాలు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీవి రమణ అన్నారు. శనివారం ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నాగుల చవితి పండుగను శనివారం జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున శివాలయాల్లో పూజలు చేశారు. అనంతరం కుటుంబాలతో కలసి పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. పాలు, నువ్వులను పుట్టల్లో వేశారు. పల్లెల్లో ఇబ్బంది లేకపోయినా...పట్టణాల్లోని భక్తులు మాత్రం పుట్టలను వెదుక్కుంటూ కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చింది.

- ఆంధ్రజ్యోతి బృందం


పలాసరూరల్/కాశీబుగ్గ: శాసనం గ్రామంలో పుట్ట వద్ద పాలు తాగుతున్న పాము


కోటబొమ్మాళి: నిమ్మాడలో కుటుంబసభ్యులతో కలిసి పూజలు చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


హిరమండలం: పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


పోలాకి: మబుగాంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


శ్రీకాకుళం నగరంలో..


అరసవల్లి: శ్రీకాకుళం జడ్పీ ఆవరణలో భక్తుల సందడి


రణస్థలం: పుట్టలో పాలు పోస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్


ఇచ్ఛాపురం: రామలింగేశ్వర ఆలయం వద్ద..

కట్టుబట్టలతో మిగిలారు

● నాలుగు పూరిళ్లు దగ్ధం ● సవర పద్మాపురంలో ఘటన


బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎస్ఐ కృష్ణప్రసాద్

హరిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మందస మండలం బుడార్సింగి పంచాయతీ సవరపద్మాపురం గ్రామంలో శనివారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధమై బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఉదయం వంట చేస్తుండగా నిప్పురవ్వలు ఇంటిపైకప్పుకి తగలడంతో మంటలు రాజుకున్నాయి. దీంతో సర్పంచ్ సరేష్‌పాణి గ్రహితోపాటు స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న మందస అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో సవర లాలు, సవర ఉదవ్, సవర ఢిల్లీ, సవర నోబిన్‌కు చెందిన ఇళ్లు దగ్ధమయ్యాయి. వారంతా కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. కాగా ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ బాధిత కుటుంబాలకు బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాలువలో పడి బాలుడి మృతి


అప్పలరాజు (ఫైల్)

గార, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బందరువానిపేటకు చెందిన గంగాడ అప్పలరాజు(12) వంశధార నదిలో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం అప్పలరాజు బహిర్భూమికని సమీపంలోని కాలువకు వెళ్లాడు. అయితే ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం గ్రామ సమీపంలో గల వంశధార నదిలో అప్పలరాజు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. అప్పలరాజు కొన్నాళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఫిట్స్ వచ్చి ప్రమాదశాత్తు జారిపడి నీటిలో ఉండవచ్చని కుటుంబ సభ్యులు చెబుతున్నట్టు ఎస్ఐ గంగరాజు తెలిపారు. బాలుడి తండ్రి లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. లక్ష్మణరావుకు ముగ్గురు కుమారుల్లో అప్పలరాజు రెండోవాడు. 8వ తరగతి చదువుతున్నాడు.

గేదె దూడలు పట్టివేత

ఎచ్చెర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జలుమూరు మండలంలో వివిధ గ్రామాల్లో కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న 14 గేదె దూడలను కుశాలపురం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద శని వారం పోలీసులు పట్టుకున్నారు. వీటిని విజయనగరం జిల్లాలోని కొత్తవలస గోశాలకు తరలించారు. బాధ్యులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ-2 అప్పారావు తెలిపారు.

మాజీ నక్సలైట్ ఆజాద్ కేసుల కోసం ప్రత్యేక న్యాయస్థానం

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మాజీ నక్సలైట్ దున్న కేశవరావు అలియాస్ ఆజాద్‌పై ఉన్న కేసుల విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శనివారం జిల్లాలో ఆయన పేరుతో ప్రత్యేక కోర్టును ప్రారంభించారు. వాస్తవానికి కేశవరావు సుమారు 12 ఏళ్ల కిందటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లొంగిపోయి రూ.5 లక్షల రివార్డు తీసుకున్నప్పటికీ తదుపరి ఒడిశా రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో పలు కేసులు నమోదైనట్టు సమాచారం. ఒడిశా రాష్ట్రంలో నమోదైన కేసుల వల్ల అతను ప్రస్తుతం అక్కడే జైలు జీవితం గడుపుతున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ఉన్న కేసులను త్వరితగతిన విచారణ చేపట్టాలని కేశవరావు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తొలుత ప్రత్యేక కోర్టు శ్రీకాకుళం ఏర్పాటైంది. ఈ కోర్టులో ఆయనపై నమోదైన 11 కేసులతో పాటు మన రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో నమోదైన ఐదు కేసులను విచారణ చేపట్టనున్నారు. ఒడిశా రాష్ట్రంలో కూడా ఇదే తరహా ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి అక్కడి కేసులను విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎయిమ్స్ ప్రతినిధి మహమ్మద్ షాజాద్

పాతపట్నం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కౌమారదశలో ఉన్న విద్యార్థినులపై ప్రత్యేకదృష్టి సారించాలని ఎయిమ్స్ ప్రతినిధి మహమ్మద్ షాజాద్ అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో ప్రాజెక్టు టీమ్‌లో భాగంగా మంగళగిరికి చెందిన ఎయిమ్స్ ఆధ్వర్యంలో కౌమారదశ విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ వై.యశోదలక్ష్మి, ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా నందన్న నిమజ్జనోత్సవం


దేవుపురంలో పగటివేషాలు ప్రదర్శన

నందిగాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గౌరీ పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన నందన్న నిమజ్జనోత్సవం శనివారం సందడిగా సాగాయి. నందిగాం, దేవుపురం తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీలు ఆధ్వర్యంలో పగటివేషాలు, కోలాటాలు తదితర కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించి నందెన్నలను నిమజ్జనం సైతం నిర్వహించారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

మురుగు నీటిని తొలగించండి



పోలాకి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వర్షాలకు నీరుచేరి పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిల్వ ఉంటోంది. మురుగునీటిని తొలగించాలని ఎన్నోసార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, విద్యాకమిటీ సభ్యులకు తెలియచేసిననూ ఫలితం లేకపోతుందని కళాశాల అధ్యాపక సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లం ప్రాంతంలో మట్టి వేసి మురుగునీరు తొలగించాలని విద్యార్థి సంఘ నాయకులు కోరుతున్నారు.

నాగుపాము కలకలం



మెళియాపుట్టి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పట్నాన రాము ఇంటిలో శనివారం నాగుపాము కలకలం రేపింది. బాత్‌రూంలోకి చేరిన పాము బుసలు కొట్టడాన్ని గుమనించారు. నాగులు చవితి రోజున కనిపిండంతో చుట్టు పక్కల వాళ్లు చేరుకుని గిన్నిలో పాలుపోసి పెట్టారు. అనంతరం ఆ పాములు పట్టుకొని కొండ ప్రాంతంలో విడిచిపెట్టారు.

ఓ ఇంటిలోకి..



హిరమండలం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): లోకొండ గిరిజన గ్రామంలో శనివారం ఒక ఇంటిలోకి మొగలి నాగు పాము ప్రవేశించింది. దీంతో ఇంట్లో నివసిస్తున్న వారు భయాందోళన చెందారు. దీంతో అవలంగి గ్రామానికి చెందిన పాములు పట్టే లోలుగు వేణుగోపాలరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పామును పట్టి సమీప అడవి ప్రాంతంలో విడిచి పెట్టరు.

కాలేజీ రోడ్డులో..



నరసన్నపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కళాశాల రోడ్డులో శనివాయం ఉదయం నాగుపాము కలకలం రేపింది. కాలేజీ రోడ్డులో ఉన్న ఓ చెట్టుమీద నుంచి రోడ్డుపై పడింది. అక్కడి నుంచి సమీపంలోని ఓ ఒకషాపులోకి వెళ్లింది. షాపు యాజమాని పాములపట్టేవారికి సమాచారం ఇచ్చాడు. దీంతో ఆ వ్యక్తి అక్కడికి చేరుకుని పామును పట్టి సమీపం పొలాల్లో విడిచి పెట్టారు.

ప్రతి గ్రామానికి తాగునీరు

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ గ్రామానికి సురక్షితమైన తాగునీరు అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జలజీవన్ మిషన్ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, ఉద్దానం గ్రామాల్లో కిడ్నీ సమస్యలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని అన్నీ గ్రామాలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ సూర్యనారాయణ, ఏఈ సతీష్, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

108 జంటలతో పూజలు


పూజల్లో పాల్గొన్న దంపతులు

కోటబొమ్మాళి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చిన్నహరి శ్చంద్రపురం గ్రామంలో గల పంచధామ క్షేత్రంలో శనివారం నాగుల చవితి సందర్భంగా 108 జంటలతో నాగ బంధం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంతాన సాఫల్యం, లోక కల్యాణం నిమిత్తం సంతానలేమితో బాధపడుతున్న దంపతులచే గ్రహదోష నివారణకు 100 నాగబంధాలు ప్రతిష్ఠించినట్టు ఆలయ ధర్మకర్త ఉప్పాడ కనకరాజు తెలిపారు.

భక్తులకు ఇబ్బంది రానివ్వొద్దు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం రావివలస ఎండల మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. వచ్చే భక్తులకు తాగునీరు, మజ్జిక అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. క్యూ లైన్లు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్ఎల్ నాయుడు, తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో విజేతలు

పాతపట్నం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవ మండలస్థాయి పోటీల్లో ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా రొంపివలస జడ్పీ హైస్కూల్‌కు చెందిన రేగేటి అభినయ్, పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పి.అభయ నర్సింగ, జరా బేగం నిలిచినట్టు ఎంఈవో సీహెచ్ తిరుమలరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిర వేదికగా శనివారం నిర్వహించిన ఈ పోటీల్లో మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 50మంది వరకూ విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. రొంపివలస గంగువాడ హెచ్ఎంలు నల్ల కుమారస్వామి, పీఆర్ వల్లభరావు పర్యవేక్షణలో నిర్వహించగా ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కళాశాలల అధ్యాపకులు డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ యు.భాస్కరరావు, కె.తిరుపతిరావు, టి.విజయలక్ష్మి న్యాయనిర్ణేతలు వ్యవహరించారు. ఈ మండలస్థాయి విజేతలు తదుపరి జరగబోవు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఏపీ శాసనసభలో పాల్గొనే అవకాశం కల్పిస్తారని తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలి


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న దృశ్యం

పాతపట్నం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్‌లో ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన సాగాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయాధికారిణి వై.యశోధలక్ష్మి అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకు లాన్ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల వంట గది స్టోర్‌రూం డార్మిటరీ పరిసరాలు మరుగుదొడ్లను పరిశీలించారు. స్టోర్‌రూలో స్టాక్ స్థితిగతులను పరిశీలించి వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ నిర్వాహణ వైద్యసౌకర్యాలపై ప్రశ్నించారు. అలాగే శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందుకొని బోధనలు జరపాలన్నారు. వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. ప్రిన్సిపాల్ పి.పద్మావతి ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముగ్గురు విద్యార్థుల ఎంపిక


పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పోలాకి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ముగ్గురు విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఎంఈవోలు శ్రీనివాసనాయక్, శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని 14 ఉన్నతపాఠశాలల నుంచి వ్యాసరచన, క్విజ్‌పోటీల్లో 42 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. న్యాయనిర్ణేతులుగా ఉపాధ్యాయులు బాడాన రాజు, అజయ్‌బాబు, మల్లేశ్వరరావు, చైతన్య వ్యవరించారన్నారు. ఆరుగురు ఎంపిక కాగా న్యాయనిర్ణేతలు నియోజకవర్గస్థాయికి ముగ్గురు విద్యార్థులను ఎంపికచేశారన్నారు. సీహెచ్ కీర్తన, ప్రథమ, బి.వరణ్ ద్వితీయ, పి.మనీషా తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరు ఈ నెల 29న నిర్వహిం చనున్న నియోజక వర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

స్థల వివాదంలో పోలీసులనే అడ్డుకున్న ఫిర్యాదుదారులు

● యంత్రాన్ని స్వాధీనం చేసుకోనివ్వకుండా అడ్డగింత


యంత్రంపైకెక్కి అడ్డుకుంటున్న మహిళలు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ స్థల వివాదంలో ఫిర్యాదుదారులే పోలీసులను అడ్డుకున్న ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధి రాజాం పంచాయతీ ధర్మపురం గ్రామంలో ఓ వ్యక్తికి సుమారు 25 ఏళ్ల కిందట ప్రభుత్వం స్థలాన్ని మంజూరు చేసింది. దీనిని మరో వ్యక్తి ఆక్రమించుకున్నట్టు కొన్ని నెలలుగా వివాదం కొనసాగుతుంది. ఈ క్రమంలో ఇటీవల గ్రామ పెద్దల సమక్షంలో వివాదానికి తెరపడింది. అనంతరం ఈ స్థలాన్ని మరో వ్యక్తి ఆ లబ్ధిదారుడు విక్రయించాడు. దీంతో ఆ స్థలం కొనుగోలు చేసిన వ్యక్తి చదును చేయించేందుకు వెళ్లగా.. ఆ స్థలంలో కొత్తగా పునాదులు, గోడలు ఉండడంతో యంత్రం సాయంతో వాటిని తొలగించారు. అయితే తమ స్థలంలో వేసిన పునాదులు తొలగించారని, ఆ యంత్రం యజమానిపై చర్యలు తీసుకోవాలని ముకుంద అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్ఐ నిహార్ శనివారం ఆ స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు. ఇరువర్గాలు పోలీసు స్టేషన్‌కు రావాలని చెప్పి ఆ యంత్రాన్ని స్వాధీనం చేసుకోవాలనుకున్నారు. దీంతో ఫిర్యాదుదారు, అతడి కుటుంబ సభ్యులు ఆ యంత్రాన్ని కదలనీయకుండా అడ్డుకున్నారు. పరిహారం చెల్లించాకే దీనిని తీసుకుని వెళ్లాలంటూ పోలీసులును అడ్డుకున్నారు. యంత్రాన్ని స్టేషన్‌కు తరలించిన తర్వాత మాట్లాడుకుందామని ఎస్ఐ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు పట్టించుకోకుండా ఆ యంత్రాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు అడ్డుకున్న వారికి మధ్య వాగ్వాదం జరిగింది. అడ్డుకున్నవారిని పోలీసులు చాకచక్యంగా తప్పించి ఆ యంత్రాన్ని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ మాట్లాడుతూ.. తమ విధులను ఫిర్యాదుదారులే అడ్డుకోవడం సరికాదని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అమ్మా.. జాగ్రత్త!

(ఐదో పేజీ తరువాయి)

చేసుకోవడం కలకలం రేపింది. దీంతో మన జిల్లాలో జరిగిన ఘటనలపై చర్చ నడుస్తోంది. ప్రతిచోట ఇటువంటి కీచకులు ఉంటారు. కొంతమంది బంధువుల రూపంలోనే బాలికలపై దాడి చేస్తున్నారు. వెలుగులోకి వస్తున్నవి కొన్నే. 2023లో జిల్లాలో 6 పోక్సో కేసులు నమోదయ్యాయి. 13 వేధింపులు కేసులు కూడా నమోదయ్యాయి. 2024లో 5 పోక్సో 14 వేధింపులు.. ఈ ఏడాది 4 పోక్సో కేసులు, 10 వరకూ వేధింపులు కేసులు బయటపడ్డాయి. ఇటీవల పోక్సో కేసులపై కోర్టులు కఠినతీర్పులు ఇస్తున్నాయి. అయినా సరే నిందితుల్లో మార్పు రావడం లేదు. చిన్నారులపై అఘాయిత్యాలు నియంత్రించేందుకు పోక్సో చట్టాలు తీసుకొచ్చి పదేళ్ల గడుస్తున్నా ఇప్పటికీ వేధింపులు, లైంగికదాడులు ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి పోక్సో.. నిర్భయ చట్టం కంటే కఠినమైనది. కచ్చితంగా నేరం రుజువైతే 20 ఏళ్ల శిక్షపడడం ఖాయం. అయినా సోషల్ మీడియా ప్రభావం, చెడు వ్యసనాలకు బానిసకావడం వంటి కారణాలతో మనుషులు మృగాలుగా మారుతున్నారు. పట్టణ ప్రాంతాలతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ఇటువంటి దుర్ఘటనలు అధికం. నిరక్షరాస్యత, ఆపై పేదరికం మాటున పిల్లలను లైంగిక దాడులకు తెగబడుతున్నారు.

కౌన్సెలింగ్ ఇవ్వాలి..

పాఠశాల స్థాయిలో బాలికలకు, చిన్నారులకు కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ప్రధానంగా గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన మాటలకే పరిమితం అవుతోంది. పిల్లలకు ఎవరి వద్దయినా అసౌకర్యంగా ఉందంటే వెంటనే ఇంటి వద్ద చెప్పమనాలి. అంత స్వేచ్ఛ వారికి ఇవ్వాలి. అప్పుడే వారు తమకు ఎదురయ్యే లైంగిక వేధింపులను చెప్పగలుగుతారు. వారికి ఏదైనా చేదు అనుభవం ఎదురైతే సున్నితంగా, మెల్లగా అడిగే ప్రయత్నం చేయాలి. అయితే లైంగిక దాడులకు గురైన బాధితుల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంతం వారే ఉంటున్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో ఈ రుగ్మతపై అవగాహన పెంచడం చాలా కీలకమని నిపుణులు చెబుతున్నారు.

28న యూత్ ఫెస్టివల్ పోటీలు

పాతపట్నం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా ఈ నెల 28న మండల స్థాయిలో వివిధ పోటీలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ టి.హేమసుందరరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యూత్ ఫెస్టివల్ పోటీల్లో భాగంగా ఫోక్‌డాన్స్, ఫోక్‌సాంగ్స్, పోయెట్రీ రైటింగ్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, డిక్లమేషన్ తదితర ఈవెంట్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 27వతేదీ ఉదయం 10గంట లోపు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

కాశీబుగ్గ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్‌వోబీ ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా జరుగుతున్న పనులను రెవెన్యూ, ఆర్‌వోబీ, మునిసిపల్ అధికారులు శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. మూడు రోడ్ల జంక్షన్ దుకాణాలను తొలగించిన అనంతరం ఉన్న పరిస్థితి, వంతెన కోసం చేపడుతున్న పనులు ఎంతమేర జరిగాయి, రైతు బజారు నిర్మాణానికి రహదారి వంటి అంశాలపై అధికారులు పరిశీలించారు. అనంతరం నిర్వాసితులకు జరుగుతున్న పనులపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, మునిసిపల్ కమిషనర్ రామారావు, ఆర్‌అండ్‌బీ జేఈ విక్రమ్, రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, చంద్రశేఖర్ త్యాడి, సప్ప నవీన్ పాల్గొన్నారు.

జంగిల్ క్లియర్ చేయండి



వజ్రపుకొత్తూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి నుంచి మెట్టూరు వరకు గల బీటీ రోడ్డుకి ఇరువైపులా తుప్పలు పేరుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. తుప్పలు, చెట్లు కొమ్మలు ముందుకు రావడంతో ద్విచక్ర వాహనాలు పల్టీకొట్టి ప్రమాదాలకు గురువుతున్నారు. జంగిల్ క్లియర్ విషయమై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జంగిల్ క్లియర్ చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.